క్లుప్తంగా

ముళ్లపొదల తొలగింపు



ముళ్లపొదలను తొలగిస్తున్న జేసీబీ

వల్లూరు : మండలంలోని ఆదినిమ్మాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని మిట్టపల్లె ఎస్సీ కాలనీకి వెళ్లే దారితోపాటు పంట పొలాలకు వెళ్లే దారుల వెంబడి ముళ్ల పొదలు దట్టంగా పెరిగాయి. గ్రామంలో ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి దృష్టికి స్థానికులు సమస్యను తెచ్చారు. దీనిపై స్పందించిన ఆయన తన సొంత నిధులను వెచ్చించి స్థానిక వైఎస్‌ఆర్‌సీపీ నేతల ఆధ్వర్యంలో జేసీబీతో ఆ దారుల వెంబడి వున్న ముల్ల పొదలను తొలగించారు. గుంతలమయంగా వున్న దారిలో గుంతలను చదును చేసి రాక పోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు. దీనిపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఎర్రగుంట్లలో 'లిల్లీ' సందడి



థియేటర్‌ను ప్రారంభిస్తున్న లిల్లీ సినిమా చైల్డ్ ఆర్టిస్టు నేహా

ఎర్రగుంట్ల : పట్టణంలోని ఎస్‌ఎస్‌వీ సినిమా థియేటర్‌లో లిల్లీ సినిమా చైల్డ్ ఆర్టిస్టు నేహా సందడి చేసింది. ఆధునిక హంగులతో తీర్చిదిద్దిన ఎస్‌ఎస్‌వీ సినిమా థియేటర్‌ను బుధవారం లిల్లీ మూవీ చైల్డ్ ఆర్టిస్టు నేహా పునఃప్రారంభించారు. ఈ సినిమాను చూడటానికి పెద్ద సంఖ్యలో పిల్లలు, పెద్దలు వచ్చారు. కార్యక్రమంలో లిల్లీ సినిమా నిర్మాత బాబురెడ్డి, థియేటర్ యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వ సభ్య సమావేశం

వల్లూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో శుక్రవారం ఉదయం 10: 30 గంటలకు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో తాగునీరు, పారిశుధ్యం, వైద్య ఆరోగ్యం, ప్రజా పంపిణీ నిర్వహణ, విద్య మొదలైన అంశాలను గురించి చర్చిస్తారన్నారు. మండలంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించి పూర్తి స్థాయి నివేదికలతో హాజరు కావాలని తెలిపారు.

గ్రామాల్లో వికసిత భారత్ సంకల్ప యాత్రలు



కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న అధికారులు

లింగాల : మండలంలోని అక్కులగారిపల్లె, చిన్నకుదాల పంచాయతీ గ్రామాల్లో బుధవారం వికసిత భారత్ సంకల్ప యాత్రలను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. బీజేపీ నాయకులు, మండలస్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్వజస్తంభ పునఃప్రతిష్ట కార్యక్రమాలు

వల్లూరు : స్థానిక తూర్పు వీధిలో వెలసిన శ్రీ కోదండ రామాలయంలో గురువారం నుంచి రెండు రోజుల పాటు ధ్వజస్తంభ పునఃప్రతిష్టా కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం కళశ ఆరాధన, మూర్తీశ్వర, మూల మంత్ర హోమాలు జరుగుతాయని తెలిపారు. శుక్రవారం ఉదయం ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ట, మహా పూర్ణాహుతి జరుగుతుంది. అనంతరం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం జరుగుతుంది. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరుగుందన్నారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో బుధవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా లోక కళ్యాణార్థం మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం లోకకళ్యాణార్థం గణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమాలను నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఏసీ శంకర్ బాలాజీ, ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రతిభే కొలమానంగా 'ఆడుదాం.. ఆంధ్ర'



వేంపల్లెలో క్రీడాకారులను అభినందిస్తున్న మాజీ సర్పంచ్ ఆర్‌ఎల్వీ ప్రసాద్‌రెడ్డి

వేంపల్లె : క్రీడాకారులలో ఇమిడి ఉన్న ప్రతిభను కొలమానంగా గుర్తించి వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు వేంపల్లె ఎంపీడీఓ దివిజ సంపతి తెలిపారు. బుధవారం మండలంలోని తాళ్లపల్లె, కత్తులూరు గ్రామాల్లో ఆడుదాం -ఆంధ్రా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలలో రాణించి తమ ప్రతిభను చూపాలని ఆకాంక్షించారు. అలాగే 47 రోజులపాటు జరిగే ఈ క్రీడా పోటీలలో గ్రామ సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలన్నారు. క్రీడాకారుల నైపుణాయన్ని గుర్తించి ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే మాజీ సర్పంచ్ ఆర్‌ఎల్వీ ప్రసాద్‌రెడ్డి క్రీడాకారులను అభినందించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు రాజవర్ధిని, అనిల్‌కుమార్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : మండల కేంద్రంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలలో రెండవ రోజు క్రికెట్ పోటీలు బుధవారం ఉల్లాసంగా ఉత్సాహంగా సాగాయి. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. ఎంపీడీఓ సురేంద్రనాథ్, ఎస్‌ఐ రవికుమార్‌ల ఆధ్వర్యంలో ఉత్కంఠగా పోటీలు సాగాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



లింగాలలో క్రికెట్ ఆడుతున్న యువకులు

ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ఆడాలి

పెండ్లిమర్రి : ప్రతి ఒక్క క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో ఆడాలని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డిలు అన్నారు.

మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మారుమూల గ్రామాల్లో ఉన్న క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు ఈపోటీలు నిర్వహిస్తున్నదన్నారు. ప్రతి ఒక్క క్రీడాకారుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఎంఈఓ సుజాత, మాజీ జెడ్పీటీసీ భాస్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు హుస్సేన్, మనోహర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, పంచాయితీ కార్యదర్శి లక్ష్మీపతి పాల్గొన్నారు.



వెల్లటూరులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మండల కన్వీనర్ చంద్రారెడ్డి

4 నుంచి కబడ్డీ పోటీలు

ప్రొద్దుటూరు : అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 4 నుంచి 6వ తేదీ వరకు కడపలో కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు బీజేపీ ప్రొద్దుటూరు అసెంబ్లీ కోకన్వీనర్ పర్లపాడు గౌరీశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఈనెల 30వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. విజేతలకు మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.5వేలు ఇస్తారని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి తిరుపతిలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారని, ప్రథమ బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.50వేలు ఇస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 63012 25355కు సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయుడిని నియమించండి

రాజుపాళెం : మండలంలోని పర్లపాడు జెడ్పీ హైస్కూల్‌లో ఆరు నెలలుగా తెలుగు ఉపాధ్యాయుడు లేడని, వెంటనే నియమించాలని ఆర్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ తెలిపారు. రాజుపాళెంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరు నుంచి 10వ తరగతి వరకు తెలుగును బోధించేవారు లేక విద్యార్థులు ఇబ్బందులకు పుడుతున్నారన్నారు. విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోలేదన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం (రేపు) ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజి ఫంగస్, ఇన్ఫెక్షన్స్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి (అమ్మవారు), సభ్యం(శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు(వార్ట్స్), కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కోరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు మరియు ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వడ్లతల ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తల నొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

జనవరి 31 వరకు ఈకేవైసీ చేసుకోవచ్చు

వేంపల్లె : వచ్చేనెల జనవరి 31వ తేదీ వరకు హెచ్‌పీ గ్యాస్‌కు సంబంధించిన లబ్ధిదారులు ఈకేవైసీ చేసుకోవచ్చునని సాయిరజిత గ్యాస్ ఏజెన్సీ యజమాని ఎం.రవికుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రసార మాధ్యమాలలో డిసెంబర్ 31వ తేదీలోగా గ్యాస్‌కు సంబంధించిన లబ్ధిదారులు ఈకేవైసీ చేసుకోవాలని ప్రచారం చేయడంతో గ్యాస్ ఏజెన్సీ వద్దకు అధిక సంఖ్యలో వస్తున్నారని తెలిపారు. లబ్ధిదారులు ఎవరూ తొందరపడవద్దని.. ఇంకా చాలా రోజుల సమయం ఉందని స్పష్టం చేశారు.

సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఏపీ సమగ్రశిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు, ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం వారు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కమలాపురం : ప్రజా సమస్యల పట్ల అధికార యంత్రాంగం నిర్లక్ష్యం తగదని హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ గండి భారతి అధ్యక్షతన జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపాధి హామీ, వెలుగు, విద్య, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, పీఆర్, ట్రాన్స్‌కో, హౌసింగ్, వైద్య, పశు సంవర్ధక తదితర శాఖల అధికారులు తమ శాఖ ద్వారా జరిగిన అభివృద్ధిని నివేదికల ద్వారా చదివి వినిపించారు. అయితే విద్యుత్ సమస్యలు అధికంగా ఉండటంతో ప్రసాద్‌రెడ్డి ఆ శాఖ ఎస్‌ఈతో ఫోన్‌లో మాట్లాడారు. తమ మండలానికి అవసరమైన విద్యుత్ స్తంభాలతో పాటు అందుకు అవసరమైన సామగ్రి తక్షణం మంజూరు చేయాలని ఆయన కోరారు. సామగ్రి వచ్చిన తక్షణం అన్ని విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని సమావేశంలో ఉన్న ఏఈ చాంద్‌బాషాకు సూచించారు. అలాగే త్వరలో ఎన్నికలు వస్తాయని, ఆ లోపు ఇప్పటికే మంజూరైన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించవద్దని, సమస్యలు మీ దృష్టికి రాగానే వాటిని పరిష్కరించాలన్నారు. ఎంపీపీ భారతి మాట్లాడుతూ మండల సమావేశాలకు వచ్చే సమయంలో మీరు నివేదికలతో రావాలన్నారు. ఆ పత్రులను అందరికి ఇవ్వాలన్నారు. సమావేశంలో నోటి ద్వారా చెబితే ప్రయోజనం ఉండదన్నారు. ముఖ్యంగా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుపాళెం సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎన్‌సీ పుల్లారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ప్రజా సంక్షేమం, అభివృద్ధే సీఎం జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 20వ వార్డు రాజీవనం కాలనీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాయని అందని వారు ఉంటే తమ దృష్టికి తెస్తే పథకాలు అందేటట్లు చేస్తానన్నారు. సచివాలయ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, ఆ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ ఆలీ, కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్‌రఫీ, రాజేశ్వర రెడ్డి, సయ్యద్‌హసం, మడిశెట్టి శివ, సుర్యనారాయణరెడ్డి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ కరీముల్లా, జెక్కు చెన్నకృష్ణారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, కేవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గండి రామాలయ గదుల జోలికి వస్తే ఉద్యమిస్తాం



గండిలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

చక్రాయపేట : గండి కోదండ రామాలయానికి చెందిన గదుల జోలికి వస్తే ఉద్య మిస్తామని బీజేపీ నేతలు మండిపడ్డారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రామచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మ, ప్రదాన కార్యదర్శులు హరిప్రసాద్ తదితరులు కోదండ రామాలయం గదుల విషయంపై గండిలో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. గండి ఆలయ మాజీ చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్‌తో పాటు మరి కొందరు కలసి కోదండ రామాల య గదులను స్వాధీనం చేసుకుని ఆంజనేయస్వామి ఆలయ ఆస్తుల్లో కలిపే చర్యలు చేపడుతున్నారన్నారు. కోదండ రామాలయం చరిత్ర ఎంతో ఘణమైనదని ఆలయానికి సంబంధించి గదుల నిర్మాణం చేపట్టిన స్థలానికి సంబంధించి రికార్డులు కూడా ఉన్నాయన్నారు. గండి ఆలయంలో జరిగే అక్రమాల గురించి పట్టించుకోని మాజీ చైర్మన్ కోదండరామాలయం జోలికి పరిగెత్తుకొస్తున్నాడన్నారు. ఈవిషయంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మహేశ్వరరెడ్డి, సీనియర్ నేతలు లక్ష్మిరెడ్డి, అంజన్, విశ్వ హిందూ పరిషత్ నేతలు పాల్గొన్నారు. అ సందర్భంగా జైశ్రీరాం అంటూ నినాదాలు చేశారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : పోస్టల్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ సర్కిల్ అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ జనరల్ శివనాగరాజు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోస్టల్ కార్యాలయంలోని పీఎల్ఐ, ఆర్‌పీఎల్‌ఐ ఫైళ్లను తనిఖీ చేశారు. అనంతరం చిన్న మొత్తాల పొదుపుపై ఏజెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పోస్టల్ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించి చేర్పించేలా కృషి చేయాలన్నారు.

పోస్టల్ సూపరింటెండెంట్ జి.రాజేష్, ఏఎస్పీలు భాస్కర్ రెడ్డి, రెడ్డిబాష, సర్కిల్ పీఎల్ఐ ప్రాజెక్టు మేనేజర్ అచ్యుత్ కుమా తదితరులు పాల్గొన్నారు.

మృత్యుంజయేశ్వరస్వామికి నూతన ఆలయం

– నేటి నుంచి పనులు ప్రారంభం

కడప కల్చరల్ : కడప నగరంలోని మృత్యుంజయ కుంటలోగల శ్రీ మృత్యుంజయేశ్వరస్వామికి నూతన ఆలయం నిర్మాణం కానుంది. దీనికి సంబంధించిన పనులు గురువారం ప్రారంభం కానున్నాయి. ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష, నగర మేయర్ కె.సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, దేవదాయశాఖ అధికారులు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటివరకు ఉన్న ఆలయం వెనుకగల మైదానంలో నూతన ఆలయాన్ని నిర్మించనున్నారు.

– కాగా 2010 నుంచి నూతన ఆలయం నిర్మించే ప్రయత్నాలు సాగాయి. నాటి నగర మేయర్ పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో నూతన ఆలయ నిర్మాణాన్ని తలపెట్టారు. రూ. 65 లక్షల బడ్జెట్‌ను మంజూరు చేయించారు. తొలి విడతగా రూ. 20 లక్షల పనులు జరిగాయి. ఇప్పుడున్న ఆలయానికి సరిగ్గా వెనుక విశాలమైన ఆలయ నిర్మాణం ప్రారంభమైంది. ప్రభుత్వాలు మారడంతో ఆ తర్వాత పనులు నిలిచిపోయాయి. 2017లో మేయర్ సురేష్ బాబు ఆలయ పనులపై దృష్టి సారించారు. మంజూరైన నిధులలో ఖర్చు చేసిందిపోగా మిగతా సొమ్మును విడుదల చేయించేందుకు రాష్ట్ర దేవదాయశాఖ అధికారులను సంప్రదించి అనుమతులు సాధించారు. దీంతో ప్రస్తుతం రూ. 40 లక్షలతో మిగతా పనులు చేసేందుకు రంగం సిద్ధమైంది.

కుష్టు వ్యాధి నయం అవుతుంది

ప్రొద్దుటూరు క్రైం : మండలంలో చేపడుతున్న కుష్టు వ్యాధి గ్రస్తుల గుర్తించే కార్యక్రమాన్ని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హనీఫ్ బాబా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధిని గుర్తించి వైద్యం చేయించుకుంటే పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. కుష్టువ్యాధి గ్రస్తుల గుర్తింపు కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ఈనెల 27 నుంచి జనవరి 12వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఆశ, ఆరోగ్య కార్యకర్తలు ప్రతి కుటుంబాన్ని సందర్శించి చర్మంపై స్పర్శ లేని మచ్చలు, పాలిపోయిన లేక రాగి రంగులో పొడలు ఉన్న వారిని గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ శ్రీను, సూపర్ వైజర్ బీపీ వరప్రసాద్, సీహెచ్‌ఓ నాగేంద్ర, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఆరోగ్య కార్యకర్త నాస్రిరాణి, ఆశా కార్యకర్తలు స్వర్ణలత, శ్రీవాణి పాల్గొన్నారు.

ఘనంగా అయోధ్య రామయ్య అక్షింతల ఊరేగింపు



అయోధ్య రామయ్య అక్షింతల గ్రామోత్సవంలో చిన్నారుల చెక్కభజన కార్యక్రమం

పులివెందుల టౌన్ : అయోధ్య రామ మందిరం నుంచి వచ్చి అక్షింతలను హిందువులందరూ కలిసి బుధవారం గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక పీడబ్ల్యూ కాలనీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి ఆంజనేయస్వామి విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఉన్న ప్రత్యేక పల్లకిలో ఉంచి జై శ్రీరామ్ కాషాయ జెండాలను చేతబూని అయోధ్య రాముని అక్షింతల మూటలను తలపై పెట్టుకుని జై శ్రీరామ్.. జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు.

గ్రామోత్సవంలో హిందు బంధువులందరూ ఏకతాటిపై కాషాయ తిలకం దిద్ది జై శ్రీరామ నామ జపములతో హోరెత్తించారు. సరస్వతి విద్యామందిరం పాఠశాల చిన్నారులచే చెక్కభజన కార్యక్రమం ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. అలాగే హిందువులు బైకులకు కాషాయ జెండాలను కట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు, గాంధీ సర్కిల్, కచేరి రోడ్డు, పూలంగళ్ల సర్కిల్ మీదుగా పాత బస్టాండులోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హిందు ధర్మప్రచార సమితి సభ్యులు, హిందువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేంపల్లె : స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జేఈ శివదినేష్ తెలిపారు. పులివెందుల రోడ్డులోని కొత్త కందుల కాంప్లెక్ బీజీఎస్ ఎలక్ట్రానిక్స్, రాయచోటి బైపాస్ రోడ్డు, ఎన్‌టీఆర్ సర్కిల్, ఆర్‌ఎస్ కాలనీ, ఎస్‌ఎస్‌ఆర్ కల్యాణ మండపం, ఫైర్‌స్టేషన్, గురుకుల పాఠశాల తదితర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు, అలాగే వైఎస్సార్ పార్కు, పోలీస్‌స్టేషన్, కాపువీధి, గాండ్ల వీధి, పాతపేట, మెయిన్ బజార్, అమ్మవారిశాల వీధి తదితర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

కమలాపురం : తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం స్పందించి తక్షణం పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులకొండారెడ్డి తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు బుధవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించక పోవడం విచారకరమన్నారు. సమ్మె చేపట్టి 16 రోజులు గడిచిందని ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు స్పందించి అంగన్‌వాడీలు సమ్మె విరమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఐటీయూసీ, సీఐటీ యూ నాయకులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

కడప అర్బన్: కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అగాడివీధికి చెందిన పఠాన్ షాషా (18) అనే యువకుడు ఈనెల 23వ తేదీ నుంచి కనిపించడం లేదనీ అతని తల్లి పఠాన్ షాహినా బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పఠాన్ షాబుద్దీన్, షాహినాకు ముగ్గురు కుమారులు వున్నారు. వారి రెండవ కుమారుడు తన స్నేహితులతో కలిసి ఈనెల 22వ తేదీన తాడిపత్రికి వెళ్లి వచ్చాడు. ఆలస్యంగా ఇంటికి రావడంతో తల్లి మందలించింది. తరువాత రోజున ఇంటిలో ఎవరూలేని సమయంలో, ఎవరికీ చెప్పకుండానే వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతని తల్లిదండ్రులు, బంధువులు యువకుడి ఆచూకీ కోసం వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప టూటౌన్ ఎస్ఐ జయరాముడు తెలియజేశారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి



సూచిక బోర్డులు లేని అలవలపాడు రహదారి

పులివెందుల రూరల్ : పులివెందుల నుంచి అలవలపాడుకు వెళ్లే రహదారిలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. పులివెందుల నుంచి అలవలపాడుకు వెళ్లే దారిని బాగా నిర్మించారు కానీ.. ఎక్కడ ఏ మలుపు ఉంది, ఎక్కడ స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయనే తెలిపే సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు కూడా సూచిక బోర్డులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పులివెందుల-అలవలపాడుకు వెళ్లే రహదారిలో స్పీడ్ బ్రేకర్లతోపాటు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నాగనాథీశ్వరుని కొండ అభివృద్ధికి కృషి

ఖాజీపేట : నాగనాథీశ్వర కొండ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, భక్తులకు మేరుగైన సౌకర్యలు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని మైదుకూరు నియోజక వర్గ సమన్వయ కర్త శెట్టి పల్లి నాగిరెడ్డి అన్నారు.

నాగనాథీశ్వర కొండ చైర్మన్‌గా గు మ్మ నాగలక్ష్మిరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో నాగిరెడ్డి మాట్లాడుతూ ఆలయం కొండ పై 108 అడుగుల విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించడం సంతోషకరమన్నారు. అందుకు తన వంతు సహాయం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్, ఎంపీటీసీ శ్రీనివాసులు, సర్పంచ్ పెద్దిరెడ్డి. మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు మున్వర్ తోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

31న ముగ్గుల పోటీ

కడప కల్చరల్ : రెడ్డి సేవా సమితి కడపశాఖ ఆధ్వర్యంలో ఈనెల 31న ముగ్గుల పోటీ నిర్వహించనున్నామని సంస్థ కార్యదర్శి లెక్కల కొండారెడ్డి తెలిపారు. సంక్రాంతి సంబరాలు 2024 పేరిట గ్రామీణ క్రీడలు, సంస్కృతిని ప్రోత్స హించేందుకు ఇప్పటికే స్త్రీ, పురుషుల కబడ్డీ, కోలాటం, చెక్కభజన, కర్రసాము, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించామన్నారు. కాగా ఈనెల 31న ఎర్రముక్కపల్లెలోని శివశివానీ స్కూలు మైదానంలో స్త్రీలకు ముగ్గుల పోటీ నిర్వహిస్తామన్నారు. గంట సమయంలో 4.5 అడుగుల పొడవు, వెడల్పులో ముగ్గు వేయా ల్సి ఉంటుందన్నారు. విజేతలకు రూ. 10,000, రూ. 7500, రూ. 5000తోపాటు ఐదుగురికి చీరలను బహుమతిగా ఇస్తామన్నారు. జనవరి 7న బండలాగుడు పోటీ నిర్వహిస్తామన్నారు. ప్రథమ బహుమతి రూ. లక్ష, ద్వితీయ బహుమతి రూ. 75,000, తృతీయ బహుమతి రూ. 50,000, ఆ తర్వాత రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు బహుమతులు ఇస్తామన్నారు. పోటీలో పాల్గొనే ప్రతి ఎద్దుల యజమానులకు రూ. 5 వేల ప్రోత్సాహక బహుమతి ఉంటుందన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు దొప్పలపూడి ఈశ్వర్ పిలుపునిచ్చారు. బుధవారం ఈ మేరకు కడప నగరపాలక సంస్థలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కోసం జనవరి 7 వ తేదీన విశాఖపట్నంలోని గురజాడ కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయి మహాసభ ఏర్పాటు చేస్తున్నామని, ఈ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అక్కరబోయిన అప్పలరాజు, వైస్ ప్రెసిడెంట్ విశ్వనాథ్ రెడ్డి, నగర పాలక సంస్థ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ షకీల్ అహ్మద్, జనరల్ సెక్రెటరీ రవిబాబు, ట్రెజరర్ లూకరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.